పురంలో హైటెన్షన్

- ఓవైపు బాలయ్య పర్యటన.. మరోవైపు వైసీపీ నాయకుల కవ్వింపు చర్యలు
- పోలీసులకు ముచ్చెమటలు

7

చేనేత వస్త్రాలకు పూర్వవైభవం తీసుకొద్దాం

- హిందూపురం అంటే నందమూరి పురం
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
- చేనేతల కోసం ప్రత్యేక పథకాలు: సవిత



చేనేతలకు మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చేనేతలకు పూర్వవైభవం తీసుకొద్దామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆదివారం ముదిరెడ్డిపల్లిలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకంలో భాగంగా మొదటి విడత మంజూరైన చేనేత మగ్గాల పరికరాలు, మెగా చెక్కును బీసీ సంక్షేమ, చేనేతజౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే బాలకృష్ణ అందజేశారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. ఎన్టీఆర్ హయాం నుంచి చేనేతలకు వైభవం వచ్చిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేనేత వస్త్రాలకు ధరలులేక మగ్గాలు మూతపడే దుస్థితి దాపురించిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేనేతలకు పలు పథకాలను అందజేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మట్లాడుతూ.. చేనేత వస్త్రాలకు విదేశాల్లో సైతం గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ముందుగా బాలాజీ సర్కిల్లో రూ.92.5 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేసి, పైలాన్ ఆవిష్కరించారు. పురం అభివృద్ధికి రూ.540 కోట్లతో పనులు చేపడతామన్నారు. ఈ పనులకు సీఎంఓలు ఉన్నాయనీ, నిధులు త్వరలోనే విడుదల అవుతాయన్నారు. పురం ప్రజల చిరకాల కోరిక రైల్వే రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం వాల్మీకి ఆలయాన్ని సందర్శించి, పూజల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండులో ఆసుపత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రాష్ట్ర కమిషనర్ రేఖారాణి, మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, చంద్రమోహన్, షఫీ, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.



మరువ పారుతున్న బుక్కపట్నం చెరువు

మరువ పరవళ్లు

ఉమ్మడి జిల్లాలోనే పెద్దదైన బుక్కపట్నం చెరువు పూర్తిగా నిండిపోయింది. నెల రోజులుగా హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను చెరువుకు వదులుతున్నారు. దీంతో చెరువు పూర్తిగా నిండిపోయి, ఆదివారం మరువ పారింది. చెరువు రెండేళ్ల తర్వాత నిండడంతో రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున మరువ వద్దకు చేరుకుని, గంగ పూజలు చేశారు. పంటల సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు ఆనంద పడుతున్నారు. యువకులు చెరువులోకి దూకుతూ ఈత కొట్టారు. పెద్దఎత్తున జనం తరలిరావడంతో మరువ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. చెరువు వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

-కొత్తచెరువు(ఆంధ్రజ్యోతి)

పగిలిన పైపులైన్



నాగుల కనుమ సమీపంలో పైపులైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

కొత్తచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం పుట్టపర్తికి వెళ్లే నాగులకనుమ సమీపంలో సత్యసాయి నీటి సరఫరా పైపులైన్ ఆదివారం ఉదయం పగిలిపోయింది. దీంతో తాగునీరు వృథాగా రోడ్డుపైకి ప్రవహించింది. పైపులైన్‌పై భారీగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు వెళ్లడంతో.. పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా రోడ్డుపైకి ప్రవహిస్తూ వాహనదారులకు తీవ్ర అసౌకర్యానికి కలిగించింది. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు జరుగుతుండటంతో ప్రశాంతి నిలయానికి ఈ పైపులైన్ ద్వారానే తాగునీరు సరఫరా అవుతోంది. పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో నీటి కోసం పుట్టపర్తి, ప్రశాంతినిలయం ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. విషయం తెలుసుకున్న సత్యసాయి పైపులైన్ కార్మికులు యుద్ధ ప్రాతికపదికన మరమతులు చేపట్టి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చేశారు.

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన న్యాయాధికారులు

7

హంద్రీనీవా కాలువలో వైద్యాధికారి గల్లంతు

- గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

పెట్టుబడుల సంబరం..!

ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులు

విశాఖ సీఐఐ సదస్సులో జిల్లాకు అగ్రస్థానం

పెరగనున్న ఉపాధి అవకాశాలు



టేకులోడు పారిశ్రామిక పార్కు

పుట్టపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకు పెట్టుబడుల వరద రానుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించినట్లు జిల్లాకు పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. తాజాగా విశాఖపట్నం వేదికగా రెండు రోజులపాటు జరిగిన పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో జిల్లాకు అగ్రస్థానం లభించింది. ఈ సదస్సులో కొత్త కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. జిల్లాలో స్పేస్ సిటీతో పాటు రూ.1201 కోట్ల పెట్టుబడులతో అపెరెల్, ఆటో ఏరోస్పేస్ రంగాల్లో ఏర్పాటు చేస్తున్న రేమండ్స్ పరిశ్రమలకు సీఐఐ సదస్సు వేదికగా సీఎం చంద్రబాబు, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఇంధన, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటక, ఆహార శుద్ధి, తయారీ, టెక్స్‌టైల్, ఆరోగ్య, విద్య, బహుళ సంస్థల పెట్టుబడుల వరదతో వేలాది మందికి ఉపాధి అవకాశాల కల్పన జిల్లాగా అవతరించబోతోంది. ప్రధానంగా జిల్లాలో ఏరోస్పేస్ ఆటోమేటిక్ కాంపోనెంట్ పరిశ్రమల ఏర్పాటుకు రేమెండ్ గ్రూప్ అనుబంధ పరిశ్రమలు ముందుకు వచ్చాయి. రేమండ్ గ్రూపు రెండు అనుబంధ సంస్థల కోసం ఎంఎస్ జేకే మైని ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్‌కు ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ కోసం గుడిపల్లి పారిశ్రామిక పార్కులో 30 ఎకరాల్లో రూ. 441 కోట్ల పెట్టుబడితో 4096 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. చిలమత్తూరు మండలం టేకులోడుతోపాటు గుడిపల్లి పారిశ్రామిక పార్కులో రెండు చోట్ల జేకే మైని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్ విడిభాగాల తయారీ చేయడానికి 47.28 ఎకరాల్లో రూ. 262 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. రాప్తాడులో రూ. 497 కోట్లతో అపెరెల్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. ఈ యూనిట్ల ద్వారా 6,500 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి. ఇందుకోసం భూమిని కూడా కేటాయించారు. 2026 మార్చిలో పరిశ్రమల పనులు ప్రారంభమై.. 2027మే నెలలో కమర్షియల్ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

స్పేస్ సిటీతో 35 వేల మందికి ఉపాధి

జిల్లాలో రక్షణ, అంతరిక్ష రంగాలతోపాటు ఐటీ ఆటోమొబైల్ పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన భూములు అత్యధికంగానే ఉన్నాయి. జిల్లాలో స్పేస్ సిటీలో ఉపగ్రహ ప్రోటోటైప్, స్పేస్‌టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్ ఉపగ్రహ విభాగాలు తయారీ, లాంచ్ వెహికల్స్ లాజిస్టిక్స్‌కు అవసరమైన మద్దతు అందిస్తారు. వచ్చే పదేళ్లలో రూ. 25 వేల కోట్లతో 35 వేల మందికి ఉద్యోగాలు అభించనున్నాయి. లేపాక్షి, మడకశిరలో స్పేస్ సిటీని ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ దిశగా చిలమత్తూరు, లేపాక్షి, గోరంట్ల మడకశిర మండలాల్లో 23 వేల ఎకరాల్లో 16 జోన్లుగా పార్కు ఏర్పాటుకు మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతను లీ అండ్ అసోసియేట్స్ సంస్థకు అప్పగించారు. ఇప్పటికే లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు సేకరించి మధ్యలో వదిలేసి భూములతోపాటు లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల, హిందూపురం, పరిగి మండలాల్లో అనువైన భూముల గుర్తింపు సర్వే తుది దశకు వచ్చింది. భూసేకరణ కాగానే పరిశ్రమలు వస్తాయని తెలుస్తోంది. భారత వైమానిక అంతరిక్ష రంగాల్లోనూ జిల్లాలో కొత్త శకం మొదలుకానుంది.

గొంతు తడిపిన సత్యసాయి

తాగునీటి పథకానికి రూపకల్పన

రూ.380 కోట్లతో 2025 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు

1341 గ్రామాలకు నీటి సరఫరా



సీబీఆర్ నుంచి వస్తున్న నీరు

తాడిమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు చేయలేని పనిని తాను చేసి చూపించిన అపర భగీరథుడు సత్యసాయిబాబా. ఉమ్మడి జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు 1993లో సత్యసాయి నీటి సరఫరా పనులు ప్రారంభించారు. దీనికి రూ.190 కోట్ల ఖర్చు చేసి 600 గ్రామాలకు తాగునీటిని అందించాలని సంకల్పించారు. ఈ పనులు 1995 సంవత్సరానికి పూర్తి చేసి నవంబరు 23న అప్పట్లోనే వర్చ్యువల్ పద్ధతిలో సత్యసాయిబాబా రిమోట్ కంట్రోల్ ద్వారా సీబీఆర్ వద్ద మోటార్లు ఆన్‌చేసి ప్రారంభించారు. తరువాత 1998లో ఎల్అండ్‌టీకి అప్పగిస్తూ సత్యసాయి బోర్డు తీర్మానించింది. అప్పటి నుంచి వివిధ దశల్లో మొత్తం రూ.380 కోట్లు ఖర్చు చేసి 860 కిలో మీటర్ల మెయిన్ పైపులైన్ ఏర్పాటు చేసి ఉమ్మడి జిల్లాలోని 16 లక్షల 39వేల 943 కుటుంబాలకు శుద్ధ జలం సరఫరా చేస్తున్నారు. ఇందులో 558 మంది టెక్నికల్, నాన్‌టెక్నికల్ విభాగాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం (మిగతా 7లో...)

అలరించిన సరోద్ వాయిద్యం



ప్రదర్శన ఇస్తున్న ఉస్తాద్ అంజాద్ అలీఖాన్

పుట్టపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):సత్యసాయి బాబా శతజయంతి వేడుకల నాలుగో రోజు ఆదివారం సాయికుల్వంత్ సభామండపంలో ప్రముఖ సరోద్ వాయిద్య కళాకారుడు ఉస్తాద్ అమజాద్ అలీఖాన్ బృందం సరోద్ వాయిద్యంతో భక్తులను అలరింపజేసింది. గంటపాటు మైమరపింపజేసింది. ఉదయం సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనం, భక్తిగీతాల ఆలాపనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులకు ప్రశాంతి నిలయంలోని ఫుడ్‌కోర్టు వద్ద, విద్యుత్తు కార్యాలయం వద్ద నారాయణసేవ అందించారు.

రేపు రథోత్సవం

సత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా ఈనెల 18న శ్రీ వేణుగోపాలస్వామి సత్యసాయి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం నూతనంగా వెండి రథాన్ని సిద్ధం చేశారు. ఈ రథం దాదాపు 30 అడుగుల ఎత్తు ఉంది. అదే రోజు సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి సామూహిక వ్రతాలను నిర్వహిస్తారు. ప్రశాంతి నిలయం గోపురం వద్ద నుండి పెద్ద వెంకమరాజు కల్యాణమండపం వరకు రథాన్ని లాగుతారు.



వెండి రథం

స'ధర'ం స్లాట్ బుకింగ్..!

- ప్రారంభమైన వైకల్య నిర్ధారణ రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో బుకింగ్
- గంటల్లోనే భర్తీ
- డబ్బులిస్తే ఖాళీ చూపిస్తారు..
- దళారుల చేతుల్లోకి స్లాట్‌లు
- చోద్యంచూస్తున్న అధికార యంత్రాంగం
- నేడు స్లాట్ బుకింగ్ ఉంటుందా? లేదా?



స్లాట్ బుకింగ్ కోసం నిరీక్షిస్తున్న బాధితులు

అనంతపురం వైద్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు వైకల్య ధృవీకరణ పత్రాలను మంజూరు చేసే సదరం అక్రమాల నిలయంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరం స్లాట్ బుకింగ్‌లో పైసా వసూల్‌కి తెరలేపారు. అన్నీ భర్తీ అయిపోయాయని చెబుతున్నారు. పైసలిస్తే ఖాళీ చూపిస్తుండడం శోచనీయం. పారదర్శకంగా వైకల్యాన్ని ధృవీకరించి సర్టిఫికెట్లను జారీచేయడమే సదరం ఉద్దేశం. వైకల్యమున్న వారు ధృవీకరణకోసం వైద్యుడిని సంప్రదించేందుకు సదరం వెబ్‌సైట్‌లో స్లాట్‌ను బుకింగ్ చేసుకోవాలి. శారీక, మానసిక, బధిరులు, దృష్టి ఇలా వైకల్యంవారిగా సదరం వెబ్‌సైట్‌లో స్లాట్‌లను రూపొందించారు. ఆయా వైకల్యమున్న వారు సంబంధిత స్లాట్‌లో డాక్టర్‌ను సంప్రదించడానికి ఆధార్ నంబర్‌తో బుకింగ్ చేసుకుంటారు. ఈ ప్రక్రియనే సదరం స్లాట్ బుకింగ్ అంటారు.

దళారుల చేతుల్లోకి సదరం

వైకల్య నిర్ధారణ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అయిన సదరం స్లాట్ బుకింగ్‌ను సచివాలయాలు, మీసేవ కేంద్రాలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అప్పగించింది. స్లాట్‌బుకింగ్ ప్రక్రియ ఆరేళ్లుగా దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ కేంద్రాల్లో నిర్వాహకులకు మాత్రమే సదరం స్లాట్‌బుకింగ్ ఐడీ, పాస్‌వర్డ్ ఉంటుంది. ఐడీ, పాస్‌వర్డ్ ఉన్నవారిని బుట్టలోకి వేసుకుని దళారులు దందా నడిపిస్తున్నారు. దీంతో దళారులను ఆశ్రయించి ముడుపులు అప్పగించిన వారికే స్లాట్‌లు బుకింగ్ అవుతున్నాయి. సాధారణ వ్యక్తిగా సచివాలయం, మీసేవ కేంద్రానికెళ్తే.. సర్వర్ ఓపెన్ అవ్వగానే స్లాట్‌లు అన్నీ భర్తీ అయినట్లు చెబుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీలేదనీ, ప్రభుత్వం మళ్లీ ఖాళీలను చూపినపుడు చేస్తామని సమాధానమిస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు. సదరం స్లాట్ బుకింగ్ ప్రక్రియను పర్యవేక్షించే యంత్రాంగం నిద్రమత్తులోకి వెళ్లడంతో దళారులు బరితెగించి తమకు అన్యాయం చేస్తున్నారని బాధితవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రూ.1500 పైమాటే...

ఒక్కో స్లాట్ బుకింగ్‌కు రూ.1500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ సొమ్మును దళారులు, బుకింగ్ చేసే సిబ్బంది పంచుకుంటున్నారు. పైసలిచ్చుకుంటే (మిగతా 7లో..)

క్లిక్ చేస్తే...

ఖాతా ఖాళీ..!

- ఏపీకే ఫైల్ టచ్ చేస్తే సెల్‌ఫోన్ హ్యాక్
- బ్యాంకు అకౌంట్లలోని నగదు లూటీ
- మూడు నెలల్లోనే జిల్లాలో 110 కేసులు
- రూ.50 లక్షల మొత్తాన్ని లాగేసిన నేరగాళ్లు



అనంతపురం క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను చావు దెబ్బ కొడుతున్నారు. సెల్‌ఫోన్‌లకు ఏపీకే ఫైల్స్ పంపి, ఉచ్చు బిగించి లక్షల రూపాయలు కాజేస్తున్నారు. బాధితుల్లో చదువురాని వారితో పాటు ఉద్యోగులు సైతం ఉంటున్నారు. ఇటీవల మూడు నెలల కాలంలో వంద మందికి పైగా కేసులు నమోదు చేశారు. రూ.50 లక్షల వరకూ బాధితులు నష్టపోయారు. ఇవి కేసులు నమోదైన వివరాలు మాత్రమే. అనధికారికంగా, ఫిర్యాదు చేయని వారు అంతా కలిస్తే ఆ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుంది.

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు వల...

స్మార్ట్ ఫోన్ వినియోగించేవారే సైబర్ నేరగాళ్లకు ఆదాయవనరు. వారిని టార్గెట్ చేసుకుని మోసగాళ్లు ఏపీకే వల విసురుతున్నారు. స్మార్ట్ ఫోన్లలోని సోషల్ మీడియా మాధ్యమాల్లోకి ఉన్నఫలంగా బూడిద రంగులో ఉండే ఏపీకె ఫైల్స్ వస్తాయి. లేదా ఫలానా బ్యాంకు పేరుతో లేదా, సెల్ నెంబర్ ఒకే సిరీస్ ఉన్న గ్రూప్ అంటూ...ఇలా ఏదో వంకతో వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి ప్రజలను సభ్యులుగా చేరుస్తారు. ఇందులో ఏపీకే ఫైల్స్‌ను ఉంచేస్తారు. ఇదంతా క్షణాల వ్యవధిలోనే జరిగిపోతుంది. ఇది తెలియని కస్టమర్లు కొత్త గ్రూప్ అనో, ఏదో ఫైల్ వచ్చిందనో....ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేస్తారు. ఇలా డౌన్‌లోడ్ చేసిన వెంటనే వారి సెల్‌ఫోన్ సైబర్ (మిగతా 7లో...)



30 నుంచి భక్తరహళ్లి

బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని భక్తరహళ్లి గ్రామంలో వెలసిన నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 30వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహరాజు తెలిపారు. డిసెంబరు 8 వరకు కొనసాగుతాయన్నారు. 30 న రక్షబంధన, అంకురార్పణ, 1న ధ్వజారోహణ, అగ్నిహోత్రహోమం, 2న మన్యుసూక్త సనమాన హోమం, 3న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, 4న బ్రహ్మరథోత్సవం, 5న జ్యోతుల పరుష, భూతప్పల ఉత్సవం, 6న తలనీలాలు, పూలపల్లకి ఉత్సవం, 7న కంబాల నరసింహస్వామి జ్యోతుల పరుష, 8న చక్రస్నానం, వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఈఓ తెలిపారు.

క్రైం కార్నర్

హంద్రీనీవా కాలువలో వైద్యాధికారి గల్లంతు

● గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



కార్తీక్ రెడ్డి (ఫైల్)

బెళుగుప్ప/ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు సమీపంలోని పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో పడి ఆదివారం ప్రభుత్వ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి గల్లంతయ్యారు. పంపనూరు సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుని, వన భోజనాలు ముగించుకుని కాలువపై నిర్మించిన బ్రిడ్జి వద్ద ఇంటి పక్కన ఉన్న మరోవ్యక్తితో కలిసి ఈతకు దిగారు. డాక్టర్‌కు ఈత కూడా వచ్చు. నీటి ప్రవాహం ఎక్కువగా వుండడంతో తోడుగా వెళ్లిన వ్యక్తి భయపడి ఒడ్డుకు చేరుకున్నాడు. ప్రవాహం ధాటికి డాక్టర్ క్షణాల్లోనే నీటిలో కొట్టుకుపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బ్రిడ్జి నుంచి పది కిలోమీటర్ల వరకు పోలీసులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కార్తీక్‌రెడ్డి బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన వెంకటస్వామిరెడ్డి, శ్రీదేవి అనే రైతు దంపతుల పెద్దకుమారుడు. ప్రస్తుతం బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. డాక్టర్ కార్తీక్‌రెడ్డి భార్య శ్రావణి కర్నూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఒక కుమార్తె సంతానం కలదు. భార్య అందుబాటులో లేకపోవడంతో కూతురు, బంధువులతో కలిసి వనభోజనానికి వచ్చారు. నీటిలో పడిన విషయాన్ని బంధువులు స్థానిక పోలీసులుకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ప్రారంభించారు. పోలీసులతో పాటు అగ్నిమాపకశాఖ సిబ్బంది గాలించారు. కార్తీక్‌రెడ్డి కోసం కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం ఎదురు చూస్తున్నారు. ఆయన సొంత మండలంలో ప్రజలకు వైద్యసేవలు అందించాలని తపన పడేవారు. ప్రాణంతో తిరిగి వచ్చి వైద్య సేవలు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు గ్రామస్థులు, బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న, టీడీపీ నాయకులు తిమ్మప్ప, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కళ్యాణదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భర్త దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందింది. మండల పరిధిలోని బోరంపల్లిలో ఈనెల 12న ఎర్రిస్వామి అనే వ్యక్తి తన భార్య రత్నమ్మ(44)ను గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి భార్య రత్నమ్మ అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ నెల 14న ఎర్రిస్వామిని మండల పరిధిలోని శీబాయి బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ హరినాథ్ తెలిపారు. ఈ నెల 12న అనుమానంతో దంపతుల మధ్య గొడవ జరిగిందని, ఆవేశానికి గురైన ఎర్రిస్వామి భార్య రత్నమ్మ గొంతు కోశాడని వివరించారు. అనంతరం పరారీ కావడంతో ఎర్రిస్వామిని అరెస్టు చేసి రాయదుర్గం కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ పేర్కొన్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇరుపార్టీల నాయకులపై కేసుల నమోదు

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం జరిగిన ఘటనలో టీడీపీ, వైసీపీకి చెందిన నాయకులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. శనివారం వైసీపీ ఇన్‌చార్జ్ దీపికా భర్త వేణురెడ్డి ఎమ్మెల్యే బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో టీడీపీకి చెందిన పలువురు ఆయనతో క్షమాపణలు చెప్పించాలని వైసీపీ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన లేకపోవడంతో అక్కడే ఉన్న వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై తిరగబడ్డారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ కార్యకర్తలు కార్యాలయంలోని ఫర్నీచర్‌ని ధ్వంసం చేశారు. దీంతో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. టీడీపీ పట్టణ కన్వీనర్ వెంకటేష్, మండల కన్వీనర్ హెచ్‌ఎన్ రాము, లేపాక్షి మండల కన్వీనర్ అభిలాష్, యుగంధర్, రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, బాబురెడ్డి, ఇందాద్, ప్రవీణ్, అంజి, బాజిల్, బాబు, ఇదాయ్, అమాన్, జబీలతో పాటు మరో 40 మందిపై కేసునమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దీపికా భర్త వేణురెడ్డి, వాల్మీకి లోకేశ్, దివాకర్, వాసీం, నవీన్, మనోజ్ గౌడ్, ఇర్షాన్‌తో పాటు మరో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్యవర్గం ఎంపిక



కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర నాయకులు మల్లేశ్వరరావు, మద్దిలేటి, సుబ్రహ్మణ్యం, కె. రమణ పర్యవేక్షణలో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా టి. చెన్నప్ప, సహాధ్యక్షుడిగా పి. వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీహరి, నాగరాజు, కార్యదర్శిగా పెద్ద రెడ్డప్ప, సంయుక్త కార్యదర్శులుగా రాధమ్మ, వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా పక్కీరప్ప, కోశాధికారిగా జాఫర్‌ను ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

నూతన కార్యవర్గం..



పశుసంవర్థక శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

అనంతపురం అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా పశుసంవర్థక శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సాయినగర్‌లోని వెటర్నరీ ఆస్పత్రిలో ఆ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై సంఘం తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడిగా మహేంద్ర ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బాబునాయుడు, ఉపాధ్యక్షులుగా వరప్రసాద్, సురేష్ బాబు, సహాయ కార్యదర్శులుగా రామాంజనేయులు, ఆదినారాయణ, కోశాధికారిగా విశ్వనాథ్, ఈసీ సభ్యులుగా నాగపవన్, ఆదినారాయణ, రేవతి, నరసింహులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం సభ్యులకు పలువురు సంఘం సభ్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సహకార ఉద్యోగుల సంఘం..



మల్లరాయుడు, కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి. మల్లరాయుడును ఎన్నుకున్నారు. సహకార ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం స్థానిక సుభాష్‌రోడ్డులోని ఎన్టీఆర్ సహకారభవన్ ప్రాంగణంలో నిర్వహించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ లీలావతి, సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగాధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ సజావుగా జరిగింది. వెంటనే ఓట్ల లెక్కింపు, ఫలితాలను ప్రకటించారు. ప్రభుత్వ సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి. మల్లరాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా స్రుజన్, ఉపాధ్యక్షుడిగా వైఎండీ ఇస్మాయిల్, కార్యదర్శిగా కుమార్, సహాయ కార్యదర్శులుగా రమేష్‌బాబు, రమణమాధవి, కోశాధికారి వెంకటేశ్వర్లు, కార్యవర్గసభ్యులుగా నరసింహమూర్తి, లతీఫ్ ఎన్నికయ్యారు.

గొంతు తడిపిన సత్యసాయి

(5వ పేజీ తరువాయి)

274 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, 165 రిజర్వాయర్‌లలో 66 పంప్ స్టేషన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పీఏబీఆర్ డ్యాం, పెన్నా, హెచ్ఎల్‌సీ, బీజీబీసీ, మిడ్‌పెన్నార్ కాలువ ద్వారా నీటిని సమీకరించుకుని ఐదు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులలో నీటిని నిల్వ ఉంచి నిరంతరం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ తాగునీటి పథకాలు లేని గ్రామాలకు కూడా సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చి సత్యసాయి బాబా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు.

ఎక్కడెక్కడ ఫిల్టర్ పాయింట్లు ఉన్నాయంటే..

పెద్దకోట్ల వద్ద రెండు ఫిల్టర్ పాయింట్లు ఉన్నాయి. వీటిలో రోజుకు 2.01 కోట్ల లీటర్లనీటిని ఫిల్టర్ చేసి తాడిమర్రి పంప్‌హౌస్‌కు పంపుతారు. వాటిని తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరంరూరల్, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలకు సరఫరా చేస్తారు. అలాగే కదిరికి చిన్నకోట్ల వద్దగల వాటర్ స్కీం ద్వారా, కళ్యాణదుర్గం, ఆత్మకూరు మండలాలకు పీఏబీఆర్ ద్వారా, నార్పల, చుట్టు పక్కల గ్రామాలకు బి.పప్పూరు పాయింట్ నుంచి పంపిస్తారు. బుక్కరాయసముద్రం మండలానికి అక్కడే నీటిని ఫిల్టర్ చేసి పంపుతారు. కొనకొండ్ల, రాయలచెరువు, గార్లదిన్నె, కల్లూరు, గుత్తి, గుడిసెలపల్లి, పెద్దపప్పూరు, గడేకల్లు, తీటకల్లు, సజ్జలదిన్నె, కొండూరు, రావిలవెంకటాంపల్లి వద్దగల రెండు నీటి సరఫరా పథకాల ద్వారా నిత్యం 1341 గ్రామాల్లోని 16,39,983 కుటుంబాలకు 5.82 కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.



స్వచ్ఛమైన నీరు తాగుతున్నాం



సత్యసాయి బాబా ఏర్పాటు చేసిన నీటి సరఫరా వల్ల స్వచ్ఛమైన నీటిని తాగుతున్నాం. తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్న సమయంలో బాబా స్పందించి నీటి సరఫరా చేసి మా అందరికి దేవుడుగా మారాడు. ఆ నీరు లేకపోతే మాకు తాగునీరే లేదు.

-శ్రీనివాసరెడ్డి, కునుకుంట

అప్పుడు తోటనీరే గతి



బాబా లేకుంటే మాకు తోట నీరే గతి అయ్యేది. సత్యసాయి తాగునీరు లేకపోతే మాకు తోటల వద్ద నీరు తప్ప మరో మార్గం లేదు. మా గ్రామం చుట్టూ ఉన్న రైతులు వారి ఇళ్లకు తోటల వద్ద నుంచి పైపులైన్ వేసుకుని నీటి అవసరం తీర్చుకునేవారు. సత్యసాయినీరు వచ్చిన తరువాత అందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరుగుతోంది.

-నాగేంద్ర, మద్దెలచెరువు

దిగుడుబావే దిక్కు



గతంలో మా గ్రామంలో తాగునీటి కోసం దిగుడుబావి, చేతిబోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునే వాళ్లం. ఇంట్లో ఒకరికి పనులు మానేసి నీటి కోసం సమయమంతా సరిపోయేది. సత్యసాయిబాబా పుణ్యమా అని మా గ్రామంలో ట్యాంకులు, వీధివీధికి కొళాయిలు వేయడంతో తాగునీటి సమస్య తీరింది. దాంతో పాటు ఫ్లోరైడ్ సమస్య తీరింది.

-హేమాదేవి, గాండ్లవారిపల్లి, ముదిగుబ్బ మండలం

క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ..!

(5వ పేజీ తరువాయి)

నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లిపోతుంది. దీంతో కస్టమర్ల బ్యాంక్ ఖాతాలు, మెయిల్స్, మెసేజ్‌లు అన్నీ హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాలోని డబ్బులను దోచేస్తారు. ఇలా మోసపోయే బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్. దీన్నే సంక్షిప్తంగా ఏపీకే ఫైల్. ఆండ్రాయిడ్ ఫోన్లలో యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోడానికి ఉపయోగించే ఈ ఫైల్ ఫార్మాట్‌ను ఆధారంగా చేసుకుని నేరగాళ్లు నకిలీ ఏపీకే ఫైల్స్ ద్వారా సెల్‌ఫోన్లు హ్యాక్ చేసే మాల్వేర్‌తో మన సెల్‌ఫోన్లలోకి చొరబడి దోచేస్తున్నారు.

రూ. 50 లక్షల పైనే...

జిల్లా వ్యాప్తంగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల వల్ల ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో 110 కేసులు నమోదయ్యాయి. వీళ్లలో చదువుకున్న యువత, ఉద్యోగుల నుంచి, అక్షర జ్ఞానం లేని పల్లె ప్రజలు కూడా ఉన్నారు. ఫిర్యాదు చేయని బాధితులు చాలా మందే ఉన్నారు. ఇప్పటి వరకూ ఈ మూడు నెలల్లో 110 మంది బాధితులు రూ.50లక్షలపైనే పోగొట్టుకున్నట్లు తెలిసింది. కాగా సుమారు 54 మంది బాధితుల సెల్‌ఫోన్ల నుంచీ మాల్వేర్‌ను తొలగించి, వారి మెయిల్స్, వాట్సాప్, ఇతర డేటా రికవరీకి పోలీసులు సాయం చేశారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త గ్రూపుల్లో చేరే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్రమత్తతే రక్షణ...

సైబర్ నేరగాళ్లు ఢిల్లీ, బిహార్, పంజాబ్, హరియాణా వంటి ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా హాంకాంగ్, జింబాంబ్వే, కెన్యా ఇలా ఎక్కడి నుంచి అయినా... సెల్‌ఫోన్లలోకి మాల్వేర్‌ను చొప్పించే ప్రమాదం ఉంది. ఏపీకే ఫైల్స్ ద్వారా మాల్వేర్‌తో ఎంట్రీ ఇచ్చి మనకు సంబంధించిన డేటాతోపాటు, మన బ్యాంకుల్లో డబ్బును దోచేయవచ్చు. వీళ్ల చేతికి చిక్కకుండా ఉండాలంటే నిత్యం అప్రమత్తంగా ఉండాలి. మనకు సంబంధం లేని వ్యక్తుల నుంచీ ఏపీకే ఫైల్స్ వచ్చినా.... వాటిని డౌన్‌లోడ్ చేయరాదు. అదేవిధంగా అపరిచితులు యాడ్ చేసే గ్రూప్స్‌లో సైతం ఉండకూడదు. ఓటీపీలు అసలే చెప్పరాదు.

ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయరాదు



ప్రజలకు అవసరం లేని, అనవసరమైన ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయరాదు. ప్రజలకు తెలిసిన వ్యక్తుల నుంచి వచ్చినా, తెలియని వ్యక్తుల నుంచి వచ్చినా అవసరమైన సమాచారం ఉన్న ఫైల్స్ మాత్రమే క్లిక్ చేయాలి. ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయరాదు. అవగాహనతో ఉండాలి. ఇదే ప్రజలకు సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ.

-జగదీష్, ఎస్పీ, అనంతపురం

23న కళ్యాణదుర్గంలో సైన్స్ సంబరాలు

- జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాజు

అనంతపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న కళ్యాణదుర్గంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా కార్యదర్శి వీరరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేపీ చిత్తప్ప అధ్యక్షతన నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 44 జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయని తెలిపారు. ప్రతి జట్టులో 8, 9, 10వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఉంటారని, వారంతా ఇప్పటికే పాఠశాల, మండల స్థాయిల్లో మొదటి స్థానంలో ఎంపికయ్యారని వివరించారు. జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో గెలుపొందే ఒక ప్రభుత్వ పాఠశాల జట్టు, మరో ప్రైవేట్ పాఠశాలల నుంచి మరో జట్టును రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కర రామిరెడ్డి, నాయకులు గాంగేనాయక్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.40



అనంతపురం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.24తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.43 లక్షలు

అనంతపురంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్లో జరిగిన పశులసంతవల్ల మార్కెట్‌కు రూ.3.43 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.07 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.36 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

పురంలో హైటెన్షన్

● ఓవైపు బాలయ్య పర్యటన..


మరోవైపు వైసీపీ నాయకుల కవ్వింపు చర్యలు

● పోలీసులకు ముచ్చెమటలు

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసీపీ ఇన్‌చార్జి దీపిక భర్త వేణురెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం, అందుకు నిరసనగా.. వైసీపీ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను టీడీపీ శ్రేణులు ధ్వంసం చేయడంతో పట్టణంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం ఉమ్మడి జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్యనేతలు.. హిందూపురానికి రావడానికి ప్రయత్నించారు. వారిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కడప నుంచి వస్తున్న సతీష్‌రెడ్డిని కదిరి వద్దే పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారు. కదిరి మగ్బూల్‌ను లేపాక్షిలో అడ్డుకుని వెనక్కు మళ్లించారు. వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని హిందూపురం మండల కొల్లకుంట వద్ద అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించారు. ఎట్టకేలకు వారిని హిందూపురానికి రాకుండా పోలీసులు వెనక్కు పంపించేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు రెచ్చిపోయి మాట్లాడారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వస్తుండగా అడ్డుకున్నారు. మరో మాజీ ఎంపీ రంగయ్య హిందూపురానికి చేరుకుని, వైసీపీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆ పార్టీ పరిశీలకుడు రమేష్‌రెడ్డి హిందూపురానికి చేరుకుని పగిలిన కార్యాలయం అద్దాలను పరిశీలించారు.



ఉషశ్రీని అడ్డుకుంటున్న పోలీసులు



పోలీసులతో అనంత వెంకటరామిరెడ్డి వాగ్వాదం

ఏం జరుగుతుందోనని..

హిందూపురంలో ఓవైపు బాలకృష్ణ పర్యటన కొనసాగుతుండగా.. మరోవైపు ఉమ్మడి జిల్లా వైసీపీ నేతలు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులకు చెమటలు పట్టాయి. వైసీపీ నేతలు.. పార్టీ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలపాలని నిర్ణయించుకున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణపై ఇప్పటివరకు వైసీపీ నాయకులు విమర్శలు చేసినా, అవాకులు చవాకులు పేల్చినా.. ఊరుకున్నారు. శనివారం దీపిక భర్త వేణు చేసిన అనుచిత వ్యాఖ్యలకు బాలకృష్ణ తనదైన శైలిలో హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నడూలేని విధంగా వైసీపీ కార్యాలయంపై దాడి చేశారు. ఎమ్మెల్యే స్థానికంగా ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని పోలీసుల్లో హైటెన్షన్ నెలకొంది. ఈ పరిస్థితుల్లో వైసీపీ నాయకులను ఎక్కడికక్కడే అడ్డుకోవడంతో బాలకృష్ణ పర్యటన ప్రశాంతంగా ముగిసింది. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన న్యాయాధికారులు



తిమ్మమ్మ మర్రిమాను వద్ద మర్రి ఊడలను పరిశీలిస్తున్న న్యాయాధికారులు

నంబులపూలకుంట/గాండ్లపెంట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటిబైలులో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమర్రిమానును జిల్లా న్యాయాధికారులు ఆదివారం సందర్శించారు. ఎస్సీ,ఎస్టీ కోర్టు న్యాయాధికారి సాధుబాబు, ఫోక్సో కోర్టు న్యాయాధికారి చిన్నబాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి పద్మ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్‌తోపాటు వారి కుటుంబ సభ్యులు వచ్చారు. వారికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. తిమ్మమాంబ, బాలవీరయ్యను సందర్శించి, ప్రత్యేక పూజలు చేయించారు. టూరిజం గైడ్ మనోహర్ తిమ్మమాంబ జీవిత చరిత్రను వివరించారు. మర్రిమాను ఊడలు, చరిత్రను తెలిపారు. అనంతరం మర్రి ఊడలను పరిశీలించారు. వారితోపాటు ఏఎస్ఐ కిషోర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అనంతరం గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని యోగి వేమన ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయం చుట్టూ రాసి ఉన్న వేమన పద్యాలు, జీవిత చరిత్రను పూజారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఏఎస్ఐ వెంటరాముడు ఉన్నారు.

కదిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో..

కదిరిలీగల్(ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహస్వామిని ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టు న్యాయాధికారి సాధుబాబు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పార్థసారథి ఆచార్యులు శ్రీవారి సేవతో ఆశీర్వాదం చేశారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన కార్తీక్ ఎంపికయ్యాడు. ఈనెల 8, 9 తేదీల్లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ అండర్-11 పోటీల్లో అత్యంత ప్రతిభ చాటిన కార్తీక్ జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. డిసెంబరు 8న గుజరాత్‌లోని వడోదరలో జరిగే నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు కార్తీక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన కార్తీక్‌కు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్, సభ్యులు రామాంజనేయులు, షాషావలి, శాప్ కోచ్ నరేష్‌కుమార్ క్రీడాసామగ్రి అందజేసి అభినందించారు.

అథ్లెటిక్స్‌కు..

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ పోటీలకు రిద్ధి అనే విద్యార్థిని ఎంపికయింది. నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న రిద్ధి ఇటీవల శ్రీకాకుళం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 అథ్లెటిక్ 400 మీటర్ల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి సత్తా చాటడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబరు 1వతేదీ నుంచి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 అథ్లెటిక్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. రిద్ధిని డీఎస్‌డీఓ మంజుల, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసులు అభినందించారు.

జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాజట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రకటించారు. సాఫ్ట్‌బాల్ బాలుర జట్టులో...బాలు, భరత్‌సింగ్ నాయక్, ప్రణీత్, సాయిరాజ్, ఖాసీం, కులశేఖర్, దినేష్‌నాయక్, మునీంద్ర, గణేష్, తరుణ్‌కుమార్, వేదశ్యామ్, శరవణకుమార్, ఫణీంద్రనాథ్‌రెడ్డి, అజయ్, ఘర్షణ్‌యాదవ్, దీక్షిత్‌రెడ్డి, రాజేష్ ఉన్నారు. బాలికల జట్టుకు...చందన, అంజలి, మైనావతి, పల్లవి, సుకన్య, రాధిక, నందిని, హేమలత, లక్ష్మీదేవి, శ్రావణి, అమని, లలితప్రియ, జనని, హారిక, పూజితాంజలి, లలిత ఎంపికయ్యారు. బేస్‌బాల్ బాలుర జట్టులో... స్టీఫెన్, నౌషాద్, జగన్మోహన్ రెడ్డి, శాంతన్‌సాయి, లోహిత్‌కుమార్, శివానంద, సందీప్, సంతోష్, రాహుల్, ప్రవీణ్, హుస్సేన్ వలీ, రాజశేఖర్, శివసాయి, రాఘవేంద్ర, సంతోష్‌కుమార్, ధరణి ఉన్నారు. బాలికల జట్టుకు పూర్ణిమ, వెన్నెల, కరీనా, సింధు, లిఖిత, చైతన్య, అక్షయ, తేజశ్రీ, అంజలి, తబుసుం, రిషిత, నశ్రీన్, ప్రత్యూష, జానూ, భవిత, జ్యోష్ణలు ఎంపికయ్యారు. ఎంపికైన జట్లను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గాయత్రి, ఎస్‌జీఎఫ్ సభ్యులు లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, నరసింహారెడ్డి, పక్కీరప్ప, రమేష్, శివ, రాజశేఖర్ రెడ్డి, సంజీవరాయుడు, ఆంజనేయులు, లతాదేవి, హిమబిందు, ప్రమద, సూర్యనారాయణమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో బంగారు పతకం

గుంతకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఓపెన్ రోల్ స్కేటింగ్ టోర్నమెంట్‌లో గుంతకల్లుకు చెందిన విద్యార్థి బి.దేవానంద్ నరసింహ ప్రతిభను చాటి స్వర్ణ పతకాన్ని సాధించాడు. యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆలిండియా లెవెల్‌లో ఓపెన్ స్కేటింగ్ పోటీలను నిర్వహించారు. గుంతకల్లులోని పెంగ్విన్ మాంటిస్సోరి పాఠశాలలో చదువుతున్న దేవానంద్ నరసింహ 8-10 సంవత్సరాల వయస్సు కేటగిరిలో జరిగిన రోల్ స్కేటింగ్ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో మొదటి స్థానంలో నిలిచిన ఈ విద్యార్థికి బంగారు పతకం లభించింది. జాతీయ స్థాయి ఓపెన్ పోటీలో ప్రతిభను చాటిన దేవానంద్ నరసింహను నిర్వాహకులు, కోచ్‌లు అభినందించారు.

స'ధర'ం స్లాట్ బుకింగ్..!

(5వ పేజీ తరువాయి)

నిమిషాల్లో బుకింగ్ చేస్తున్నారు. ఇచ్చుకోలేనివారు నెలల తరబడి తిరగాల్సిందే. డబ్బులెందుకు ఇవ్వాలని గట్టిగా ప్రశ్నించిన వారికి ఉమ్మడి అనంతపురం జిల్లా కాకుండా నెల్లూరు, శ్రీకాకుళం, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు ఇలా ఇతర జిల్లాల్లోని స్లాట్‌లను బుకింగ్‌చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో స్లాట్‌బుక్ అయినా తెలియని ప్రాంతాలకు వందల కిలోమీటర్లు ప్రయాణించలేక సదరం క్యాంపులకు హాజరు కావడంలేదని వాపోతున్నారు. దళారుల ప్రమేయాన్ని నిలువరిస్తేనే తమకు న్యాయం చేకూరుతుందని బాధిత వర్గాలు వేడుకుంటున్నాయి.

నేటి నుంచి బుకింగ్ కొనసాగుతుందా..?

సదరం ధ్రువీకరణ పత్రాలకోసం ఈనెల 14 నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభమైనట్లు డీఎస్‌హెచ్ చక్రధర్ ప్రకటనలో తెలిపారు. ఆమేరకు శుక్ర, శనివారాల్లో జిల్లాలో అక్కడక్కడ సదరం స్లాట్‌బుకింగ్ చేశారు. ఈ రెండు రోజులు దళారుల చేతుల్లోని వారికి మాత్రమే అవకాశం దక్కింది. సోమవారం నుంచైనా అర్హుల కోసం స్లాట్‌బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందా? లేదా? అన్న అనుమానాలను బాధిత వర్గాలు వ్యక్తంచేస్తున్నాయి. హిందూపురం, అనంతపురం జిల్లా ఆస్పత్రులతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లోని ఏరియా హాస్పిటళ్లలోనూ స్లాట్‌బుకింగ్ అయ్యేలా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాయి. లేకుంటే మరో మూడునెలలు నిరీక్షించక తప్పదని వాపోతున్నాయి.

న్యూస్ బాక్స్

ఘనంగా పెద్దమ్మ దేవత కోన



అలంకరణలో పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లు

బత్తలపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని వడ్డే వీధిలో వెలసిన పెద్దమ్మ దేవత ఆలయంలో కోన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పెద్దమ్మ, సుంకులమ్మ విగ్రహాలను ప్రతేకంగా అలంకరించారు. సాయంకాలం పూజారులు, భక్తులు కల్లు దుకాణం వద్దకు వెళ్లి ఘటము తీసుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం కాలనీవాసులు, భక్తులు బోనాలు తీసుకొచ్చారు. రాత్రి 10గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి జంతుబలులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొండన్న,పెద్దన్న, బొజ్జప్ప, రమేష్, రమణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పూజా సామగ్రి వితరణ



పూజా సామగ్రి అందజేస్తున్న టైలర్ నిజాం

ఓబుళదేవరచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ టైలర్ నిజాం ఆదివారం మండలపరిధిలోని ఎం కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో 41 రోజులకు సరిపడే పూజా సామగ్రిని అందజేశారు. పూజా సామగ్రిని ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజినేయులు నాయుడుకు అందజేశారు. అలాగే 250 మంది అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. 14 సంవత్సరాలుగా అయ్యప్ప ఆలయానికి 41 రోజులకు సరిపడా పూజా సామగ్రిని అందించడంతో పాటు అయ్యప్ప ఆలయానికి సేవలు అందిస్తున్న నిజాంను పలువు రు కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి, శివాలయం నిర్మాణ దాత రఫీక్, తెలుగుమహిళ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

నల్లమాడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేసి, పూజలు చేశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి సత్యసాయిబాబా భక్తుడు సతీష్ ఆధ్వర్యంలో విదేశీ భక్తులు షిర్డీబాబా ఆలయంలో అన్నదానం నిర్వహిం చారు. మండలపరిధిలోని భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డితో పాటు గ్రామస్థులు పూల రామయ్య, డీలర్ శంకర్, చంటి, జనార్దన్, రమణమ్మ, ఆంజనేయులు ఉన్నారు.

సబ్సిడీతో ఉలవల పంపిణీ

గాండ్లపెంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలలో ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలను సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి షాదాబ్ తెలిపారు. కావల్సిన రైతులు రైతు పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రాలకు తీసుకురావాలన్నారు. పది కిలోల ఉలవల బ్యాగ్ పూర్తి ధర రూ. 560 కాగా 80 శాతం సబ్సిడీ పోను రైతు రూ. 112 చెల్లించాలని తెలిపారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

కదిరి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు స్థానిక బ్లూమూన్ డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ శివశంకర్ తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో 50 సీట్లు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 12, బీఎస్సీ బాటనీ 13, బీఎస్సీ మ్యాథమెటిక్స్ 25, బీఎస్సీ జువాలజీలో 25 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గుండెపోటుతో రిటైర్డ్ కండెక్టర్ మృతి

● ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె నివాళి

నల్లమాడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పెమనకుంటపల్లికి చెందిన రిటైర్డ్ కండెక్టర్ పాలక్రిష్టప్ప (65) శనివారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదివారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్య టీడీపీ నాయకురాలు కావడంతో ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మృతునికి భార్య అంజనమ్మ, కుమారుడున్నారు. వారితో పాటు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణంనాయుడు, తోట్లో మంజునాథ్‌రెడ్డి, సలాంఖాన్, మైలే రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే కందికుంట నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

నల్లచెరువు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గాలివీటి కృష్ణమోహన్‌నాయుడు తండ్రి గాలివీటి శ్రీరాములు నాయుడు వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మండలంలోని చిన్నయల్లంపల్లికి వెళ్లి శ్రీరాములు నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యేతోపాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సురేష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలి మృతి



తనూజా (ఫైల్)


నంబులపూలకుంట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లగుట్టపల్లి తండాలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తు న్న ఉపాధ్యాయురాలు తనూజా (32) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఆమె కదిరి పట్టణంలోని రౌండుబిల్డింగ్ ప్రాంతంలో నివాసముంటున్నారు. మృతురాలికి భర్త, పదేళ్ల కుమారై ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్ర సాద్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

జగనన్న వృథా కాలనీ..!

● ఊరికి 3 కి.మీ. దూరంలో 140 మందికి పట్టాలు
● భూమి చదును చేయడానికే రూ.30 లక్షలు
● విద్యుత్ స్తంభాలకు అదనపు ఖర్చు
● ఆసక్తి చూపని జనం.. ఒక్కరే నివాసం



జగనన్న కాలనీలో పెరిగిన కంపచెట్లు



కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

తనకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా వృథా చేశారనేందుకు నిదర్శనమే ఈ జగనన్న కాలనీ. అధికారులు, ప్రజాప్రతినిధులు అనాలోచిత నిర్ణయాలతో జగనన్న కాలనీ అడవిని తలపిస్తోంది. తనకల్లు మేజర్ పంచాయతీ పరిధిలోని 30 పల్లెల లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో 140 మందికి పట్టాలు ఇచ్చారు. మేజర్ పంచాయతీకి సమీపంలో కాకుండా.. బత్తినవారిపల్లి వద్ద జగన్నకాలనీ పేరుతో ప్రభుత్వ భూమిని ఎంపిక చేశారు. ఆ భూమిని చదును చేయడానికి రూ.30లక్షలకు పైగా ఖర్చు చేశారు. అదనంగా కాలనీకి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, హడావుడిగా లైన్లు లాగారు. రోడ్లు, తాగునీరు తదితర సౌకర్యాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తనకల్లుకు మూడు కిలో మీటర్ల దూరంలో కాలనీ ఏర్పాటు చేయడంతో.. అక్కడికి వెళ్లడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. అధికారులు పక్కాగృహాలు మంజూరు చేస్తాం, మౌలిక వసతులు కల్పిస్తామని ప్రగల్భాలు పలకడంతో ధైర్యం చేసి కొందరు ముందుకొచ్చారు. దీంతో ప్రభుత్వం నలుగురికి పక్కాగృహాలు మంజూరు చేసింది. వారు నలుగురు గోడల వరకు ఇంటి నిర్మాణం చేపట్టారు. నిరుపేదలైన ఇద్దరు మహిళలు మాత్రం ఒకే ఇంటిలో నివాసం ఉంటున్నారు. మిగిలిన వారెవరూ ఆ చాయలకు వెళ్లిన పాపాన పోలేదు. దీంతో ప్రభుత్వం వెచ్చించిన రూ.30 లక్షలు, విద్యుత్ కోసం చేసిన ఖర్చు వృథా అయ్యాయి. పట్టాలు పొందినవారు ఇళ్లు నిర్మించుకోవాలని అధికారులు ఎన్నిసార్లు చెప్పినా లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. దీంతో కాలనీ కోసం ఏర్పాటు చేసిన ప్రాంతం కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. పనికిరాని భూమిని ఎంపిక చేయడంతోనే వృథాగా మారిందనే విమర్శలు ఉన్నాయి.

12 చోట్లా ఇదే స్థితి

తనకల్లు మండల వ్యాప్తంగా జగనన్నకాలనీల పేరుతో 12 చోట్ల ప్రభుత్వ భూమిని ఎంపిక చేసి చదును చేశారు. ఇందుకోసం రూ.55 లక్షలు ఖర్చు చేశారు. 345 మందికి పట్టాలు ఇచ్చారు. 146 గృహాలు మంజూరు చేశారు. ఒక్కచోటకూడా ఒక్క కాలనీ ఏర్పాటు కాలేదు. జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎవరూ నివాసాలు లేరని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో చదును చేయడానికి ఉపయోగించిన రూ.55 లక్షల ప్రభుత్వ ధనం వృథా అయినట్లేనని తెలుస్తోంది.

ఒంటరిగా నివాసం ఉంటున్నా



మాది తనకల్లు పంచాయతీలోని వంకపల్లి. మా గ్రామం నుంచి 8 కిలోమీటర్లు దూరంలో జగనన్న కాలనీలో నాకు పట్టా ఇచ్చారు. పక్కాగృహం మంజూరు చేశారు. కాలనీలో 140 మందికి పట్టాలిచ్చారు కదా.. అందరూ వస్తారులే అనుకుని ఇల్లు నిర్మించుకున్నా. ఏ ఒక్కరూ ఇక్కడికిరాలేదు. కాలనీ మొత్తం కంపచెట్లతో నిండిపోయింది. పాములు, విషపురుగుల సంచారం అధికంగా ఉంది. పెద్ద పెద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన అధికారులు కనెక్షన్ ఇవ్వడం మరిచారు. విధిలేని పరిస్థితుల్లో నేను ఒక్కదాన్నే నివాసం ఉంటున్నాను. నీటి సౌకర్యం కూడా లేదు. బత్తినవారిపల్లిలోకి వెళ్లి నీటిని తెచ్చుకోవాలి. అధికారులు నా ఒక్క ఇంటికైనా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నా.

-ఈశ్వరమ్మ, జగనన్నకాలనీ, బత్తినవారిపల్లి

లబ్ధిదారులు ముందుకు రాలేదు



నేను తనకల్లు, నల్లచెరువు మండలాలకు ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. కదిరిలో ఉన్న సిమెంటు గోడౌన్‌కు కూడా ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నాను. జగనన్న కాలనీల్లో 345 మందికి పట్టాలు మంజూరు చేశారు. గృహం నిర్మించుకోవడానికి ఏ ఒక్క లబ్ధిదారుడు ముందుకు రాలేదు. ఒక్క కాలనీలో కూడా ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. బత్తినవారిపల్లి కాలనీలో ఓ వృద్ధురాలు నివాసం ఉన్నారు.

-విజయభాస్కర్, ఏఈ, గృహనిర్మాణ శాఖ

ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు


● అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి



డీఐజీ సమక్షంలో జియోగ్రాఫికల్ మ్యాప్‌పై భద్రతా ఏర్పాట్లను వివరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల పురస్కరించుకుని ఈనెల19న ప్రశాంతినిలయానికి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి జిల్లా పోలీసుకార్యాలయంలోని పోలీసుకమాండ్ కంట్రోల్ రూం ఆవరణలో బందోబస్తు నిమిత్తం వచ్చిన 17 జిల్లాల పోలీసు అధికారులకు బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఐజీ, ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 19న ప్రధాని నరేంద్రమోదీ, 22, 23 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు గవర్నరు, డిప్యూటీ సీఎం, వీవీఐపీలు, వీఐపీలు ఉత్సవాలకు హాజరవుతున్న ఆయా సెక్టార్ ఇన్చార్జిలు బ్రీఫింగ్ చేశారు. జియోగ్రాఫికల్ మ్యాప్‌ను ప్రదర్శిస్తూ విమానాశ్రయం నుంచి కార్యక్రమ స్థలాల వరకు మొత్తం రూట్ మ్యాప్‌ను ఎస్పీ తెలియచేశారు. ప్రతిపా యింట్‌లో అప్రమత్తంగా ఉండి, పూర్తి సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని డీఐజీ పోలీసు అధికారులకు సూచించారు.

మోటార్ మెకానిక్ షాప్‌లో చోరీ



శ్రీవారి హోటల్ కౌంటర్‌లో డబ్బులు వెతుకుతున్న దొంగలు (సీసీ పుటేజీ)

ముదిగుబ్బ, నవంబరు, 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అనంతపురం రోడ్డులో ఉన్న తన మోటార్ మెకానిక్ షాపులో చోరీ జరిగినట్లు బాధితుడు సోమశేఖర్ తెలిపారు. అతడు రోజు మాదిరాగానే శనివారం రాత్రి షాప్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం షాప్ వద్దకు వెళ్లగా, షాప్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా షాపులో ఉన్న దాదాపు రూ.50 వేలు విలువ చేసే 35 కేజీల కొత్త కాపర్ వైరు, 20 కేజీల పాత కాపరు వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు గమనించాడు. ఈ మేరకు ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. అలాగే మండల కేంద్రంలోని శ్రీవారి హోటల్, బాలాజీ చికెన్ సెంటర్ల తాళాలు పగులగొట్టి క్యాష్ కౌంటర్లలో వెతికారని, ఏమి దొరక్కపోవడంతో వెను దిరివెళ్లినట్లు వాటి యజమానులు పేర్కొన్నారు. ఈ ఘటనపై సీసీ కె మెరాలలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వద్దు'

ధర్మవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటు పరం చేయవద్దని, ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు డిమాండ్‌చేశారు. రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓహోంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతి ద్వారా వైద్య విద్యను పూర్తిగా ప్రైవేటు శక్తులకు ఇవ్వాలని చూస్తోందన్నారు. అందులో భాగంగా పెనుకొండలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాలను ప్రైవేటీకరణ చేసే యత్నాన్ని విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతారన్నారు. న్యాయవాదులు సుమలత, అతావుల్లా, కాంగ్రెస్ నాయకులు తుంప ర్తి పరమేశ్, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, చేనేత నాయకులు, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నెలరోజులుగా రోడ్డుమీదే మురుగు నీరు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కదిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తలుపుల పంచాయతీ పరిధిలోని తూపల్లి హరిజన వాడలో నెలరోజులుగా రోడ్డుమీదే మురుగు పారుతోంది. పైపులైన్ లీకేజీ కోసం గుంతలు తవ్వారు. కానీ లీకేజీకి మరమ్మతులు చేయలేదు. దీంతో లీకేజీ నుంచి వస్తున్న నీరంతా రోడ్డుపైన మురుగుతో కలిసి పారుతోంది. నెలరోజులుగా ఇలా మురుగు నీరు పారుతుండడంతో రోడ్డు పాచి పట్టింది. దీనిపై నడుస్తున్న చిన్నారులు, వృద్ధులు జారిపడు తున్నారు. నెలరోజుల నుంచి రోడ్డుపై మురుగుపారుతున్నా, పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలని కోరారు.

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సమన్వయకర్త వీరపాండ్యన్

పుట్టపర్తి టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 19న పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఆదివారం రాత్రి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్ల సమన్వయ అధికారి వీరపాండ్యన్ పుట్టపర్తికి చేరుకున్నారు. మొదట కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ మౌర్య భరద్వాజ్‌తో కలిసి ప్రధాని రాక సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం విమానాశ్రయం వద్ద తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి ప్రశాంతి నిలయం చేరుకుని సాయికుల్వంత్ హాలులో సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధాని పర్యటించే ప్రదేశాలను పరిశీలించారు. హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే ప్రధాని బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

శతజయంతికి సర్వం సిద్ధం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకల విజయవంతానికి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆదివారం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు విషయాలను ఆయన వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో భక్తజనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో పాటు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మరియు పోలీసు యంత్రాంగం సమన్వయ సహకారాలతో ప్రభుత్వపరమైన పనులను పూర్తిచేసినట్లు తెలిపారు. జయంతి వేడుకల నిర్వహణలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారాలు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానున్నా రని, అలాగే 22న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధా కృష్ణన్, రాష్ట్ర గవర్నర్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్నట్లు తెలిపా రు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హర్యానా మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితర ప్రముఖులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు కలెక్టర్ సూచన ప్రాయంగా తెలిపారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయండి

● సీపీఎం నాయకులు

కదిరి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 'అక్టోబరు విప్లవం.. విశిష్టత' అనే అంశంపై పట్టణంలోని కోనేరు వద్దనున్న ఎస్కే ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో జరగనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వారు ఆదివారం సీపీఎం స్థానిక కార్యాలయంలో విలేరుల సమావేశంలో మాట్లాడారు. 1917 అక్టోబరు విప్లవం ప్రపంచ చరిత్రలో నవశకానికి నాంది పలికిందన్నారు. చరిత్ర గమనాన్ని పునరావలోకనం చేసుకోవ డానికి నిర్వహించే జిల్లా సదుస్సుకు మేధావులు, అభ్యుదయ వాదులు, వామపక్ష శ్రేయోభిలాషులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దివ్యనామస్మరణ చాంటింగ్ ప్రారంభం



దివ్యనామస్మరణ చాంటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో పుట్టపర్తి ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు మైకుల ద్వారా సత్యసాయి దివ్యనామస్మరణ చాంటింగ్‌ను ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మహిళా పోలీసు స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం వారు చాంటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 24 వరకు మైకుల ద్వారా సాయినామస్మరణతో పాటు ప్రశాంతినిలయంలోని బాబా శతజయంతి ఉత్సవాల కార్యక్ర మాలు సైతం ఆడియో రూపంలో... స్థానిక గణేష్ కూడలి నుంచి చిత్రావతి బ్రిడ్జి వరకు ప్రతిరోజూ భక్తులకు స్పష్టంగా వినిపించేలా ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటుచేశారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆది నారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

● వారోత్సవాల్లో జిల్లా ఇన్‌చార్జి ఆదినారాయణ



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి

పుట్టపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలంటూ జిల్లా ఇన్‌చార్జి ఆదినారాయణ సూచించారు. స్థానిక ఎనుములపల్లి వ్యవసాయ సహకార సంఘంలో ఆదివారం 72వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాలు జరుపుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి జెండా ఆవిష్కరించి, సొసైటీ అధ్యక్షుడు ఉమ్మినేని వెంకటరాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాస్ నాయక్, సీఈఓ రవిశంకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సంఘం సిబ్బంది

అమడగూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కమ్మల నరేష్, సబ్ డివిజినల్ అధికారులు జనార్దన్, షాహిద్ బాషా, బ్యాంక్ మేనేజర్ సునీత హాజరై సహకార పతాకాన్ని ఎగురవేశారు. సూపర్‌వైజర్ బ్రాహ్మచారి, మాజీ ప్రెసిడెంట్ వెంకటశేషయ్య, సంఘం డైరెక్టర్లు చంద్ర, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

'అయ్యంకి సేవలు మరువలేనివి'

ధర్మవరం/కొత్తచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలు మరువలేనివని గ్రంథాలయ అధికారి అజంలి సౌభాగ్య వతి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, హనుమంతరావు, శ్రీహరిసర్వోత్తమరావు, రంగనాథ్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కొత్తచెరువులోని శాఖ గ్రంథాలయంలో జాతీయనాయకులు, సంఘసంస్కర్తలు, గ్రంథాలయ ఉద్యమకారుల గురించి పాఠకులకు తెలియజేసినట్లు గ్రంథాలయ అధికారి రమేష్‌నాయక్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఇటీవల విజయవాడలో సబ్ జూనియర్ జూడో పోటీల్లో ... బాలుర కేటగిరిలో విక్రాంత్, అఫ్జల్ మెహరాజ్, బాలికల విభాగంలో సంజనా ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 17 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వారు పాల్గొంటారని తెలిపారు. ఆ క్రీడాకారులను హెచ్‌ఎం తిమ్మారెడ్డి, ఉపాధ్యాయలు అభినందించారు.

క్రికెట్ పోటీల్లో ప్రెసిడెంట్ జట్టు విజయం

కదిరి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఆర్టీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆసక్తిగా జరిగాయి. కేఎంసీపీ ప్రెసిడెంట్, కేఎంసీపీ సెక్రటరీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో... మొదట బ్యాటింగ్ చేసిన కేఎంసీపీ సెక్రటరీ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 130 పరుగులకు ఆల్ అవుట్ అయింది. వీరిలో సాధిక్ 30, నరసింహ 25 పరుగుల చేశారు. కేఎంసీపీ ప్రెసిడెంట్ జట్టు బౌలర్లు షారుఖ్, యుక్తి చెరో మూడు వికెట్లు తీశారు. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన కేఎంసీపీ ప్రెసిడెంట్ జట్టు 29 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించారు. వీరిలో తరుణ్ 48, షాదాన్ 30 పరుగులు చేశారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ప్రెసిడెంట్ జట్టును సీనియర్ క్రీడాకారులు ఆజమ్, షకీల్, గణేష్, శ్రీనివాసులు, రవి తదితరులు అభినందించారు.

చిల్లకొండయ్యపల్లిలో రస్తా వివాదం



దారికి అడ్డుగా వేసిన మట్టి

తాడిమర్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లిలో గడిచిన రెండు రోజులుగా రస్తావివాదం జరుగుతోంది. దాదాపు 40ఏళ్లగా గ్రామంలోని చర్చి పక్కన వెళ్లే దారిని ఓ వర్గం వారు రోడ్డుకు అడ్డుగా మట్టివేసి మూసివేశారు. దీనిపై తహసీల్దార్‌కు పిర్యాదు చేసేందుకు రావాలనిఆ దారి వెంట పొలాలకు వెళ్లే రైతులు శనివారం గ్రామంలో దండోరా వేయించారు. అయినప్పటికి ఎక్కువ మంది రైతులు వెళ్లలేదు. దీంతో పీబీసీ కాలు వ మీదుగా పొలాలకు వెళ్లే దారికి శనివారం సాయంత్రం మట్టి కట్ట అడ్డుగా వేశారు. ఇక చేసేది ఏమీలేక రైతులు పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐతో పాటు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ముందుగా మట్టికట్ట వేసిన వారిని హెచ్చరించారు. సోమవారం ఉదయం ఇరువర్గాలకు చెందినవారు తగిన ఆధారాలతో తహసీల్దార్ కార్యాలయానికి హాజరు కావాలని తెలిపారు.

న్యూస్ బాక్స్

దుర్గా, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో దుర్గావీరభద్రస్వాములు

లేపాక్షి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో అర్చకులు అమ్మవారిని రంగు రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సిద్ధేశ్వర స్వామికి..



అమరాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. స్వామివారికి సుప్రభాత సేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించామన్నారు. సిద్ధేశ్వర స్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో అలంకరించారు. వచ్చిన భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

ఘనంగా కార్తీక వనభోజనాలు



ఉసిరి చెట్టుకింద భోజనాలు చేస్తున్న బ్రాహ్మణులు

పెనుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ఘనగిరి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఐముక్తేశ్వర ఆలయంలో ఉసరిచెట్లకింద వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉసిరి చెట్టుకింద కూర్చుకుని వనభోజనాలు చేశారు. బ్రాహ్మణ సంఘం సభ్యులు సుబ్రహ్మణ్యశాస్త్రి, కన్నాస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటం ఊరేగింపు



పల్లకిపై సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

లేపాక్షి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని ఆదివారం లేపాక్షిలో సత్యసాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేక రథంలో అలంకరించి భజన బృందం వైభవంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సత్యసాయిబాబా మందిరంలో ఉదయం నుంచి భక్తులు భజన కీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నదాన, ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా ఊరేగింపును పురవీధుల్లో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఊరేగింపును తిలకించారు.

అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు



అయ్యప్పలకు భిక్షలో పాల్గొన్న టీడీపీ నాయకులు

గోరంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులకు టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ ఆదివారం భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వామి నరసింహులు, ఆలయ నిర్వాహకులు వెంకటరెడ్డి, చెన్నారెడ్డి దాతను అభినందించారు. టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి. అజంతుల్లా, నరసింహప్ప, మల్లికార్జున, హరిప్రసాద్, రమేష్, ఎస్‌వీ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



జ్యోతులను మోసుకొస్తున్న మహిళలు

రొద్దం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోగిర గ్రామంలో కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలో మహిళలు దీపాలతో ఊరేగింపు చేపట్టారు. ఆంజనేయస్వామి గుడివద్దకు జ్యోతులతో వెళ్లి కనకదాసకు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కనకదాస చిత్రపటంతో ఊరేగింపు చేపట్టారు. కురుబ సంఘం నాయకులు ఎల్ఐసీ ఆంజనేయులు, సూర్యనారాయణ, రామాంజి పాల్గొన్నారు.



కనకదాస చిత్రపటం వద్ద జ్యోతులతో మహిళలు

పావగడ(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని అక్కంపల్లి గ్రామంలో కనకదాస జయంతిని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులు మోస్తూ కనకదాస చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు చేశారు. మాజీ టీఎస్ ఉపాధ్యక్షులు కృష్ణవేణి, ఆదినారాయణ, చంద్రప్ప, కేశవప్ప, శ్రీరామప్ప, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

● అడుగడుగునా బాలకృష్ణకు జననీరాజనం

సోమదేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత నేత ఎన్టీరామారావు విగ్రహావిష్కరణ అంగరంగ వైభవంగా జరిగింది. హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ వస్తున్నారని తెలియడంతో వీధులన్నీ జనంతో కిక్కిరిశాయి. ఆయన అభిమానులు ఆయన్ను చూడటానికి మిద్దెలు, మేడలెక్కి రాకకోసం ప్రతీక్షించారు. కొత్తపల్లి క్రాస్ నుంచి ర్యాలీగా వచ్చిన బాలకృష్ణకు పూలవర్షం కురిపిస్తూ అభిమానులు నీరాజనం పలికారు. యాపిల్‌తో చేసిన గజమాలతో సత్కరించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్న బాలకృష్ణ విగ్రహావిష్కరణను అభిమానుల కేరింతల నడుమ ఘనంగా చేపట్టారు. ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర రాజకీయ చరిత్రను తిరిగిరాసిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. ఆయన రాకముందు బడుగు బలహీనవర్గాలకు ఎలాంటి రాజకీయ పదవులు దక్కలేదన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తరువాత బీసీలకు పెద్దపీట వేసి అన్ని వర్గాలకు రాజ్యాధికారం కట్టబెట్టారన్నారు. సినీ చరిత్రలో 50ఏళ్ల హీరోగా రాణించిన ఘనత తనకు దక్కిందన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ స్థానిక ప్రజలు, అభిమానుల అభ్యర్థన మేరకు తన తండ్రి రామచంద్రారావు గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ పార్టీ స్థాపించడంవల్లే మాలాంటివారు ఎందరో రాజకీయాల్లోకి రాగలిగారని తెలిపారు. హిందూపురలో వైసీపీ కార్యాలయంపై తమ కార్యకర్తలు దాడిచేయడంపై రాద్ధాంతం చేస్తున్నారన్నారు. బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే అభిమానులు ఊరుకుంటారా అని హెచ్చరించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ తాను రాజకీయంలోకి వచ్చాక అనేక కష్టాలను అనుభవించానన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ తనకు వెన్నుతట్టి ధైర్యాన్ని నూరిపోశారన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ యుగపురుషడన్నారు. ఎమ్మెల్యే సిందూరా రెడ్డి మాట్లాడుతూ బసవతారకం ఆసుపత్రి ద్వారా బాలకృష్ణ అనేక మందికి ప్రాణం పోస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహ రాయల్, నీరుగంటి చంద్ర, రంగేపల్లి వెంకటరమణ, ఆంజనేయులు, భానుకీర్తి, శరత్‌చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, మద్దిలేటి, సిద్ధలింగప్ప, సూరీ, కిష్టప్ప, సూర్యనారాయణ, ఆకుల రమణ, గట్టు మహేంద్ర, చాకర్లపల్లి శ్రీరాములు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

రాయల పాలన ఆదర్శం



శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి సవిత

సోమదేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల పరిపాలన నేటి పాలకులకు ఆదర్శమని మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. ఆదివారం సజ్జగంట రంగనాథస్వామి బలిజసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాయల పరిపాలన భావితరాలకు ఆదర్శమన్నారు. ప్రస్తుతం ఆ పాలన కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం ఆయకులు అశ్వత్థ రాయల్, ఆదినారాయణ, కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామి, నియోజకవర్గ పరిశీలకులు నర్సింహులురాయల్, అహుడా చైర్మన్ వరుణ్, మాజీ చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, పొగాకు సోము, జవాజి రమేష్, భవానీరాయల్, గోరంట్ల మార్కెట్‌యార్డ్ చైర్మన్ శైలజా వెంకటేశ్, కన్వీనర్ వెంకటేశులు, నీరుగంటి చంద్ర, రంగేపల్లి వెంకటరమణ, సిద్ధలింగప్ప, కిష్టప్ప, రామక్రిష్ణ, శరత్‌చంద్ర, భానుకీర్తి, డీవీ ఆంజనేయులు, సూరీ, చాకర్లపల్లి శ్రీరాములు పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ: మంత్రి సవిత, ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఎక్కడా లేనివిధంగా బీసీలకు టీడీపీ అండగా ఉంటుందని మంత్రి సవిత, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి అన్నారు. ఆదివారం హిందూపురంలో జరిగిన కనకదాస జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుబ కులస్థులు బాలకృష్ణ, మంత్రి సవితకు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి వాహనంపై కనకదాస విగ్రహం వద్దకు వెళ్లి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ హయాంలో కురుబ కులస్థులను గుర్తించి మా నాన్న రామచంద్రారెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించారు. నేడు చంద్రబాబు తన క్యాబినెట్‌లో తనకు అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ కురుబ కులానికి చెందిన గుడికట్ల పూజార్లకు గౌరవవేతనం ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ 538వ జయంతి ఉత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొనడం గర్వకారణమన్నారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చారు. అనంతరం 5వేల మందికి అన్నదానం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, ఐటీడీపీ రామాంజనేయులు, కన్వీనర్ అభిలాష్, మాజీ ఎంపీపీ ఆనంద్, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, చిత్రంలో మంత్రి సవిత, ఎంపీ బీకే, కనకదాస జయంతి సభకు తరలివచ్చిన అశేష జనం



ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి సవితను గజమాలతో సత్కరిస్తున్న కురుబ సంఘం నాయకులు

పూర్వ విద్యార్థుల కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అమరాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2006-07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలిశారు. కార్యక్రమంలో అప్పటి గురువులు రామచంద్రరావు, లింగప్ప, చలపతి, చిక్కన్న, శేషశయన, నాగరత్నమ్మ, అరుణ, సురేఖ, ఆంజనేయులు, ఈరన్న, యతీష్, రసూల్ బాషా పాల్గొన్నారు. మొదట సరస్వతిపూజ నిర్వహించారు. ప్రస్తుత హెచ్‌ఎం రామచంద్రారావు మాట్లాడుతూ 20ఏళ్ల గురువుల పట్ల భక్తి భావంతో పూర్వ విద్యార్థులు కలవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీషర్ట్‌లను పూర్వ విద్యార్థులు అందించారు. పాఠశాలకు ఫర్నిచర్‌ను అందించి తమవంతు చేయూతనందించారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన గనులు



ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

చిలమత్తూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే గనులను గ్రంథాలయ శాఖ అధికారి మల్లికార్జున అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంతో మంది ఉద్యమాలు చేయడంతోనే నేడు గ్రామ గ్రామాన గ్రంథాలయాలు వెలశాయన్నారు. గ్రంథాలయాలతో సమాజానికి విజ్ఞానాన్ని పంచవచ్చన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీరాములు, అధ్యాపకుడు హరిబాబు గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం తదితరుల గురించి వివరించారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నేడు మంత్రి సవిత రాక

రొద్దం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రొద్దకాంబ దేవాలయంలో సోమవారం నిర్వహించే పూజలకు మంత్రి సవిత రానున్నట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

రొళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 72వ వారోత్సవాలను సింగిల్ విండో అధ్యక్షుడు దాసిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. జెండా ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వక్కలిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, సీఈఓ హనుమంతరాయప్ప, టీడీపీ మండల కన్వీనర్ ఈరన్న, మాజీ ఎంపీపీ క్రిష్టప్ప, డైరెక్టర్లు భరత్, పంచాయతీ అధ్యక్షుడు నాగేంద్ర, బ్యాంక్ బాలరాజు, హేమంత్, మూర్తి, రవికుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సర్వేయర్ల ఎన్నికల బహిష్కరణ

పెనుకొండ టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏకపక్షంగా ఎన్నికల అధికారి వ్యవహరిస్తున్నారని డివిజన్ సర్వేయర్ల ఎన్నికలను అభ్యర్థులు, ఓటర్లు బహిష్కరించారు. ఆదివారం పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని భువనవిజయంలో ఏపీఎస్‌ఈఏ డివిజన్ లెవెల్ ఎన్నికలు నిర్వహించారు. దీనికి సంబంధించి ఎన్నికల అధికారిగా గోరంట్ల మండల సర్వేయర్ తాతయ్యను నియమించారు. ఈ క్రమంలో పెనుకొండ డివిజన్‌కు చెందిన మూడు నియోజకవర్గాల్లో 50మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 30మంది ఎన్నికలకు హాజరయ్యారు. వీరిలో 11మంది పోటీల్లో పాల్గొన్నారు. అయితే మరికొందరు రావాలని ఎన్నికల అధికారి గంటలకొద్దీ కాలయాపన చేశారని, దీంతో ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం 10 నుంచి 12గంటల వరకు నామినేషన్ తీసుకుని 12 నుంచి 1గంట వరకు స్క్రూటినీ నిర్వహించి తీసుకోవాలి. అలాంటిది 2-10 అయినా నామినేషన్ తీసుకోవడాన్ని పొడిగిస్తూనే ఉన్నారని విమర్శించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నందున వీటిని రాతపూర్వకంగా బహిష్కరిస్తున్నట్లు తెలిపామని సర్వేయర్లు పేర్కొన్నారు.

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దండి

పావగడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ప్రయోజకులు చేసినప్పుడే జీవితంలో ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఆదివారం తాలూకా పరిధిలోని నీలంపల్లి గ్రామంలో జరిగిన వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీరామ్, గిరి, అక్కులప్ప, మారప్ప, నాగలక్ష్మి, నిర్మల, వాల్మీకి నాయకులు పాల్గొని మాజీ ఎంపీని సన్మానించారు.

జూదరుల అరెస్ట్

అమరాపుం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడేపల్లి గ్రామ సమీపం కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఏఎస్ఐ రామాంజినేయులు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.14,140, ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి నిందితులను కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఆయన తెలిపారు. సిబ్బంది శ్రీరంగ రమేష్, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు యూరియా పంపిణీ

పెనుకొండ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుసేవా కేంద్రంలో సోమవారం యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ చందన తెలిపారు. రైతుసేవా కేంద్రంలో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందిస్తామన్నారు. అవసరమైన రైతులు ఆధార్, పాసుపుస్తకం జిరాక్స్‌తో వచ్చి తీసుకెళ్లవచ్చన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కు నాటుతున్న విద్యార్థులు

మడకశిర రూరల్/టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. వారం రోజుల పాటు చీపులేటి గ్రామంలో జరిగిన ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి మొక్కలు పెంచాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగసాయి ప్రసాద్, అధ్యాపకులు, రఘునాథ్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

బాలయ్య విస్తృత పర్యటన

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల హిందూపురం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదివారం ఉదయం నుంచి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు వైసీపీ నాయకులు నిరసన తెలపడానికి హిందూపురం చుట్టూ ఉన్నా అవేమీ పట్టించుకోకుండా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మలుగూరులో పశువుల ఆసుపత్రి భవనం ప్రారంభించారు. పట్టణంలోని వాల్మీకి ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో 38వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించి పైలాన్ ఆవిష్కరించారు. కనకదాస జయంతిలో పాల్గొన్నారు. ముదిరెడ్డిపల్లిలో మంత్రి సవితమ్మతో కలిసి చేనేతలకు చెక్కును అందజేశారు. టీడీపీ దివంగత నాయకులు జేవీ వెంకటస్వామి వర్ధంతిలో పాల్గొన్నారు. సోమందేపల్లిలో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం తన కార్యాలయానికి చేరుకొని నియోజకవర్గ అభివృద్ధిపై నాయకులతో సమీక్షించారు. కార్యక్రమాల్లో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ కన్వీనర్లు వెంకటేశ్, రాము, అభిలాష్, శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వత్థ నారాయణరెడ్డి, నాయకులు నాగరాజు, మంగేష్, అరుణాచలరెడ్డి, ఆనంద్, చంద్రమోహన్, పరిమళ, రాఘవేంద్ర, నెట్టప్ప, మంజునాథ్, సతీష్, రవీంద్రనాయుడు, ఉమాశంకరరెడ్డి, పవన్, వాల్మీకి సంఘం నాయకులు వెంకటరమణప్ప, ఆదినారాయణ, శ్రీనివాసులు, ఎన్నికే రాజు, శివశంకర్, యువశేఖర్, జగదీశ్, నటరాజ్, శ్రీనివాసులు, వెంకటేశ్, అనీల్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపైనే వారపు సంత



ప్రధాన రహదారిపైనే నిర్వహిస్తున్న వారపుసంత

లేపాక్షి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆదివారం లేపాక్షిలో నిర్వహించే వారపుసంత ప్రధాన రహదారిపైనే నిర్వహిస్తుండటంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. వారపుసంత నుంచి పంచాయతీకి ఆదాయం మెండుగా ఉన్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. కూరగాయల దుకాణాలు ఏర్పాటుచేయడంతో రద్దీ పెరిగింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయంతోపాటు ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి వారపుసంతలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా నివారణ చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

కార్యవర్గం ఎంపిక



నూతన కమిటీ సభ్యులతో ఉద్యోగులు

పెనుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నియోజకవర్గ వాల్మీకి ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక రామబురుజు ఆంజనేయస్వామి ఆలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సూర్యనారాయణ, నారాయణస్వామి ఆధ్వర్యంలో ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా నరసింహమూర్తి, అధ్యక్షుడిగా సత్యమయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, కోశాధికారిగా రాజశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆంజనేయులు, సలహాదారులుగా రాఘవయ్య, ఈశ్వర్‌ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చాలనే అంశంపై పోరాటం సాగించాలని ప్రతి యేడాది వాల్మీకి ప్రతిభా పురస్కారాలు అందించాలని తీర్మానించారు. అనంతరం మండల కమిటీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీశ్, ఈశ్వరయ్య, శివయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రామక్రిష్ణ, శివన్న, కేశప్ప, రమేష్, రంగేష్‌కుమార్, నాయకులు, మెహర్‌బాబా, విజ్ఞాన్ మల్లికార్జున, గోవిందప్ప, సుబ్రమణ్యం, నరసింహమూర్తి, వెంకటేశులు, గోపీ, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, సోమశేఖర్, హరీష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెనుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఎత్తివేస్తూ జీవో జారీ చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదన్నారు. 50లక్షల మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చి 18నెలలుగడుస్తున్నా ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 30వ తేదీన కడపలో రాయలసీమ భవన నిర్మాణ కార్మికుల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఏఐటీయూసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాయకులు వెంకటేశ్, శ్రీరాములు, మల్లికార్జున, కిష్టప్ప, జాఫర్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు